విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

నేడు జిల్లాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ బాష

విశాలాంధ్ర-పెనమలూరు: పోరంకిలో ఈ నెల 4వ తేదీన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన ఉన్న నేపథ్యంలో శనివారం ఎమ్మెల్సీ తలసీల రఘురాం, కలెక్టర్ రంజిత్ బాషా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఈనెల 4వ తేదీ ఆదివారం ఉదయం 10.50 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారని, రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రపతికి స్వాగతం పలుకుతారని, అక్కడి నుండి నేరుగా తాడిగడప పురపాలక సంఘం పరిధిలోని పోరంకి మురళి రిసార్టులో (పోరంకి నిడమానూరు రోడ్డు) రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పౌర సన్మానానికి ద్రౌపతి ముర్ము హాజరవుతారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మాననీయ బిశ్వభూషణ్ హరిచందన్ హాజరవుతారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పక్షాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రపతిని సన్మానిస్తారనీ, రాష్ట్రపతి ప్రముఖులను మర్యాద పూర్వకంగా కలుస్తారనీ, అనంతరం రాజ్‌భవన్‌కు చేరుకుంటారనీ, రాష్ట్రపతి గౌరవార్థం రాజ్‌భవన్లో గవర్నర్ ఇచ్చే అధికారిక విందుకు హాజరవుతారనీ, తదుపరి మధ్యాహ్నం 2.40 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని ప్రత్యేక విమానంలో బయలుదేరి విశాఖపట్నం వెళతారన్నారు. పోరంకి మురళి గార్డెన్స్ సివిక్ రిసెప్షన్ కార్యక్రమం ఏర్పాట్లు పరిశీలించారు. డయాస్ డెకరేషన్ డిజిటల్ బ్యాక్ గ్రౌండ్ ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రోటోకాల్ డైరెక్టర్ బాలసుబ్రమణ్య సింగ్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, విజయవాడ సబ్‌కలెక్టర్ అదితి సింగ్, ఆర్డీవోలు జిల్లా అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ఫ్లై ఓవర్లు గుడివాడ ప్రజల చిరకాల కోరిక

విశాలాంధ్ర-గుడివాడ : దశాబ్దాలుగా గుడివాడ ప్రజలకు ఉన్న ప్రధాన సమస్య భీమవరం రైల్వే గేట్లపై ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం తీర్చిడం నా అదృష్టం మానీ ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. శనివారం స్థానిక బస్సుస్టాండు సెంటర్‌లో రైల్వే గేట్లపై రూ.317 కోట్లతో నిర్మించనున్న రైల్వే ఫ్లైవర్ల నిర్మాణ పనులకు ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ మంత్రి ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని),జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక భూమి పూజ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ గత ప్రభుత్వాల అనాలోచిత విధానాల వల్లనే గుడివాడలో ఫ్లై ఓవర్ల సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణం హేమా హేమీల వల్ల కానిది, ఎంపీ బాలశౌరికి సాధ్యమైందన్నారు. గుడివాడ నియోజకవర్గంలో చిరస్థాయిగా ఎంపీ బాలశౌరి పేరు నిలిచిపోతుందన్నారు. పూర్తి స్థాయి మౌలిక వసతులతో డిసెంబర్ 21న టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. ఎం.వి బాలశౌరి మాట్లాడుతూ గుడివాడలో దశబ్దాల కల నేడు సాకారమైందన్నారు. కొడాలి నాని సూచనలతోనే గుడివాడలో అద్భుతమైన డిజైన్‌తో బ్రిడ్జికు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ప్రజల అవసరాలు తీర్చే వ్యక్తే నిజమైన రాజకీయ నాయకుడు అవుతాడని అలాంటి వ్యక్తే కొడాలి నాని అన్నారు. రూ.1500 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూమి పూజ కార్యక్రమంలో కేంద్ర రవాణా శాఖ అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలను ప్రారంభించిన ఎంపీ బాలశౌరి

స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో సీఎం కప్ ప్రైజ్ మనీ టోర్నమెంట్ క్రీడా పోటీలను మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరావు(నాని), జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికలు ప్రారంభించారు. శనివారం స్థానిక స్టేడియంలో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సిఎం కప్‌ను విజయవంతం చేసుకోవలన్నారు. క్రికెట్, బ్యాట్‌మింటన్, వాలీబాల్, కబాడీ విభాగాల్లో ప్రతిభను కనబర్చి ఉత్తమ క్రీడాకారులగా ఎదగలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. క్రీడాకారులకు రూ.50 లక్షల వరకు ప్రైజ్ మనీ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి నానిలు క్రీడాకారులతో ఆటలు ఆడుతూ, పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నందివాడ ఎంపిపి ఫెయ్యిల ఆదాం, స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, వైసీపీ పట్టణ, రూరల్ మండల అధ్యక్షులు గొర్ల శ్రీను, మట్టా జాన్‌విక్టర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు టిడ్కో ఇళ్ల సాధనకై ధర్నాలు

టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు వెంటనే ఇవ్వాలి : తాతయ్య

విశాలాంధ్ర-ఉయ్యూరు: టిడ్కో గృహలను అప్పగించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని సీపీఐ పెనమలూరు నియోజకవర్గ కార్యదర్శి టీ తాతయ్య అన్నారు. కంకిపాడులోని సీపీఐ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న అన్ని మండల కేంద్రాలలో టిడ్కో జగనన్న కాలనీలో వసతుల కల్పనపై ధర్నాలు చేస్తామని, పార్టీ క్యాడర్‌తో పాటు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొనాలని తాతయ్య పిలుపునిచ్చారు. సీనియర్ నేత మేరుగు విజయ్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న కాలనీ, టిడ్కో గృహల సముదాయాలలో మౌళిక వసతులు కల్పించడం, ప్రభుత్వం రూ. 5 లక్షల వరకు కేటాయించాలని అన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు పాశం రవికుమార్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఉన్నత పదవులు కట్టబెట్టిన సీఎం జగన్

రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి

విశాలాంధ్ర-తిరువూరు: చట్టసభలలో బీసీలకు ఉన్నత పదవులు కట్టబెట్టి, వెనుకబడిన కులాలకు సమున్నత స్థానం కల్పించిన సీఎం జగన్మోహన్‌రెడ్డి అని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి కాలసాని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7న విజయవాడ లో నిర్వహించనున్న 'జయహో బీసీ మహాసభ-వెనుకబడిన కులాలే వెన్నుముక' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదని, సమాజానికి వెన్నెముక వర్గాలని నమ్మిడమే కాకుండా వారికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో మరింత బలోపేతం చేసే దిశగా సీఎం కృషి చేశారన్నారు. ఈ క్రమంలో నాడు బీసీ డిక్లరేషన్ సభలో చెప్పిన ప్రతి వాగ్దానాన్ని, అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం అమలు చేసి, బీసీల పట్ల తనకున్న గౌరవాన్ని నిరూపించుకున్నారని తెలిపారు. కులాల వారీగా ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం, నామినేటెడ్ పోస్టులు సైతం కేటాయించారని పేర్కొన్నారు. అత్యంత కీలకమైన స్పీకర్ పదవితో పాటు 11మంది బీసీ ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు కల్పించి, బీసీలను బలమైన శక్తులుగా తీర్చిదిద్దారని ఆమె గుర్తు చేశారు. సీఎం బీసీల సమస్యలు, సంక్షేమం కోసం డిసెంబర్ 7న విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేర్చిన సందర్భంలో మరోసారి వాటి గురించి మరింత వివరంగా చర్చించుకునేందుకు ఈ నెల 7వ తేదీ ఉదయం 9 గంటలకు ఏర్పాటు చేసిన జయహో బీసీ మహాసభ-వెనుకబడిన కులాలే వెన్నెముక కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి బీసీ నాయకులు కార్యకర్తలు వేలాదిగా తరలి వచ్చి, మహాసభ ను విజయవంతం చేయాలని విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కాలసాని గోపాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ఎంపీపీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - పమిడిముక్కల: తాడంకి జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీపీ కాసాని వేద సుప్రజా శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల మేను పరిశీలించి భోజనాన్ని రుచి చూసి వంటశాలని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం శారదాకాంత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కంభపు రాంబాబు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర దేవస్థానం ధర్మకర్తల కమిటీ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల కమిటీ చైర్మన్‌గా గంటా చంద్రశేఖర్, ధర్మకర్తల కమిటీ సభ్యులచే దేవదాయ శాఖ అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. శనివారం దేవస్థాన పూజ మండపంలో నిర్వహించిన అభినందన సభలో నూతన కమిటీ సభ్యులను వైసిపి నాయకులు మండలి హనుమంతరావు, ఎం.వి నారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ జోగా సూర్యప్రకాష్‌రావులు అభినందించారు. అనంతరం భక్త బృందం, పెద్దలు పూలమాలలతో సత్కరించారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి : ఎంపీపీ

విశాలాంధ్ర- చల్లపల్లి : మండల పరిషత్‌కు చెందిన రాజీవ్ గాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులు లీజు విషయమై శనివారం మండల పరిషత్ అత్యవసర సమావేశం ఎంపీపీ కోట విజయ రాధిక అధ్యక్షతన జరిగింది. కాంప్లెక్స్‌లోని 18 దుకాణాలు ఉండగా, 2006లో వేలంపాటలతో దుకాణాలు కేటాయించగా కాలపరిమితి ముగిసిన తర్వాత 33 శాతం అద్దె పెంచుతూ లీజు కొనసాగించారని, గతంలో కొనసాగించిన లీజు కాలపరిమితి పూర్తయిందని ఈవోఆర్డీ బూరేపల్లి అశోక్ తెలిపారు. దుకాణాల అద్దెలు తక్కువగా ఉండటం, ఎప్పటినుంచో లీజు రెన్యువల్ చేస్తుండటంతో బహిరంగ వేలంపాటలు నిర్వహించే విషయమై సభ్యుల అభిప్రాయాలను కోరారు. చల్లపల్లి ఎంపీపీ కోట విజయరాధిక మాట్లాడుతూ, మండల పరిషత్కు కాంప్లెక్స్ ఒక్కటే ఆదాయ వనరు కావటంతో నిబంధనల మేరకు ఆదాయాన్ని పెంచుకోవాలని తెలిపారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీటీసీలు మోపిదేవి ద్వారకానాథ్, మాలెంపాటి శ్రీనివాసరావులు లీజు అంశం, షాపు అద్దెలు, అద్దెల చెల్లింపు తదితర విషయాలను ఈవోఆర్డీని ప్రశ్నించారు. ఆలోచించి నిర్ణయం తీసుకుందామనీ, ఎంపీడీవో రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్ల నేపథ్యంలో ఎంపీడీఓతో కలిసి సమావేశమై నిర్ణయం తీసుకుందామని తెలిపారు. అద్దెలు తక్కువగా ఉంటే అద్దెలు పెంచాల్సిందేననీ, ఈ విషయమై ప్రస్తుతం అద్దెకు ఉంటున్న వారితోనూ మాట్లాడి మండల పరిషత్కు ఆదాయం పెంచేలా అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుందామన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: సభ్యసమాజంలో మనతో కలిసి జీవిస్తున్న దివ్యాంగులను సర్వులూ ఆదరించాలని జిల్లా ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం (డైట్) ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని అంగలూరులోని డైట్ కళాశాలలో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దివ్యాంగుల నుంచి వారు పొందుతున్న అనుభవాలను అవగతం చేసుకొవాలనీ తద్వారా వారిలో ఆత్మ స్థైర్యాన్ని కలిగించాలని విద్యార్థులకు సూచించారు. డైట్ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న డి. సాంబయ్యను లక్ష్మీ నారాయణతో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు.

గోతాలు లేక రైతుల ఇక్కట్లు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలో రైతులు వరి ధాన్యాన్ని విక్రయించుకునేందుకు గోతాలు లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రకటనలు వాస్తవ పరిస్థితులకూ సంబంధంలేదని వారు వాపోతున్నారు. గోతాలులేక తాము రేయింబవళ్ళు ధాన్యం రాసుల వద్దే కాపలా ఉంటుదున్నామని రైతులు ఆరోపిస్తున్నారు.

నేడు అగ్నికులక్షతియుల సంక్షేమ భవనం శంకుస్థాపన

విశాలాంధ్ర-పెనమలూరు : ఏపి అగ్ని కుల క్షత్రియుల సంక్షేమ సంఘం భవనం శంకుస్థాపన ఉషోదయ ట్రాన్స్‌పోర్ట్ అధినేత పోనమాల వెంకటరామరాజు, వసుమతి దంపతులచే ఆదివారం చేస్తారని సంఘం అధికార ప్రతినిధి లకనం నాగాంజనేయులు శనివారం తెలిపారు. విజయవాడ సిరీసు కంపెనీ వెనుక అయ్యప్పనగర్‌లో సంఘం స్థలంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బర్రి ప్రసాద్ ఆధ్వర్యాన జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ఎంపీ మోపిదేవి వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర, రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయపక్షాల నాయకులు, సంఘాల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.

ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : మహిళ నర్సును వేధిస్తున్న ప్రిన్సిపల్‌ను విధుల నుంచి తొలగించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులేసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మచిలీపట్నంలో మైనారిటీ గురుకుల పాఠశాలలో స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వర్తించే ఆమె టాబ్లెట్స్ మింగి ఆత్మహత్యకి పాల్పడింది. దీనికి కారణం ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వేధింపులకు గురిచేయడం. ఈ విషయంపై ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులేసు ఆమెని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కలిసి పరామర్శించారు. ఆమెతో ఏం జరిగిందని మాట్లాడగా నాలుగు నెలల క్రితం కాంట్రాక్ట్ పద్ధతిలో స్టాఫ్ నర్స్‌గా విధుల్లో చేరానని, తనని విధుల నుంచి తప్పుకోవాలని, ప్రిన్సిపాల్ వేధింపులకు గురిచేయడం మొదలు పెట్టాడని, అదేమీ అని అడిగితే నీ కంటే ముందు ఒక మహిళ ఆ స్టాఫ్ నర్స్‌గా ఉండేదని ఆమెనే తిరిగీ ఇక్కడికి వస్తుందని చెప్పారని, అంతేకాదు ఆమెకి పెద్దల మద్దతు ఉంది కాబట్టి నువ్వు మానేయ్యాలని వేధించడంతో ఆమె పాఠశాలలో ఉండగా పారసిట్ మాల్‌తో పాటు నాలుగు రకాల మందులను పొడిచేసుకుని మింగి ఆత్మహత్యకు పాల్పడ్డానని వాపోయింది. ఈ విధంగా పాఠశాలలో, కళాశాలలో ఆడపిల్లపైన, మహిళలపైన మానసిక, శారీరక వేధింపులకు గురి చేసే వారిని విధుల నుంచి తొలగించి, కఠినంగా శిక్షించాలని, నా ఉద్యోగం నేను చేసుకునే విధంగా నాకు అవకాశం కల్పించమని, దానికి మీరంతా నాకు అండగా ఉండాలని కోరగా అఖిల భారతవిద్యార్థి సమాఖ్యగా మేము మీకు అండగా ఉంటాం అని హామీ ఇవ్వడం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ బందర్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయి కృష్ణా, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు నాగ దుర్గారావు, సాకేత్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-గన్నవరం : మండలంలోని గూడవల్లి గ్రామంలో ఆయుష్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వారిచే ప్రతి నెల మొదటి శనివాంం నిర్వహిస్తున్న వైద్యశిబిరం గూడవల్లి సచివాలయం-1లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కీళ్ళవాతం, గ్యాస్ ట్రబుల్, దగ్గు, జలుబు, చర్మవ్యాధులు, మొదలైన వ్యాధులకు రోగులను పరీక్షించి 33 మందికి పరీక్షలు చేసిన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కె. సునీత, సిబ్బంది పి కోటేశ్వరరావు, యోగ టీచర్ స్వాతి, ఈఓ మస్తాన్‌రావు, గ్రామ వైసీపీ నాయకులు కొలుసు వేణుగోపాల్ పొదిలి శ్రీనివాస్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ నిర్మించాలని చెట్లు నరికాం

విశాలాంధ్ర-పెడన: బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాకింగ్ ట్రాక్ నిర్మించాలనే ఉద్దేశంతో చెట్లు నరికామని పట్టణ పార్టీ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు వేణుగోపాలరావు చేసిన ఆరోపణలకు ఆయన వివరణ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం పట్టణ వైసిపి అధ్యక్షుడు మల్లి మాట్లా దుతూ 30 ఏళ్లుగా కాలేజీ అభివృద్ధి లేదని, ఇందులో భాగంగానే మంత్రి రూ.63 లక్షలు మంజూరు చేయించారని అన్నారు. క్రీడల నిర్వహణకు ప్రభుత్వం నుంచి నిధులు వచ్చాయన్న వేణుగోపాలరావు ఆరోపణలులో ఎలాంటి నిజంలేదన్నారు. మున్సిపల్ చైర్మన్ తన సొంత నిధులతోనే కళాశాల ఆవరణను అభివృద్ధి పరిచారని అన్నారు. చెట్లు నరకడానికి అనుమతులు ఉన్నాయా అని పాత్రికేయులు వివరణ కోరగా పర్మిషన్ లెటర్ గంగయ్య దగ్గర ఉన్నవని వైసిపి నాయకులు పెదవి విరిచారు. విలేకరుల సమావేశంలో బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీ చైర్మన్ పాల్గొనకపోవడం విశేషం. ఈ సమావేశంలో వైసిపి నాయకులు వన్నెంరెడ్డి మహంకాళి రావు కోడూరు శ్రీనివాసరావు కోమట్ల. అనిల్ వీణం రాము తదితరులు పాల్గొన్నారు.

తిరుమలై కుమార్‌కు జాతీయ అవార్డు



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రైల్వే బుకింగ్ సూపర్‌వైజర్, సుబ్బయ్య తిరుమలై కుమార్ శనివారం "శ్రేష్ఠ దివ్యాంగజన్" జాతీయ అవార్డును అందుకున్నారు. సామాజిక న్యాయం &సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వికలాంగుల సాధికారత విభాగం (దివ్యాంగజన్) ఇటీవల అవార్డులను ప్రకటించింది. విజయవాడ రైల్వేస్టేషన్‌లో బుకింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుమలై కుమార్ 2021 సంవత్సరానికి గానూ స్పోర్ట్స్ విభాగంలో ఇండివిడ్యువల్ ఎక్సలెన్స్ కోసం "శ్రేష్ఠ దివ్యాంగజన్" న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన అవార్డుల కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు.కమర్షియల్ విభాగంలో బుకింగ్ సూపర్‌వైజర్, ఆసియా పారా గేమ్స్ (6 సార్లు), కామన్ వరల్డ్ వెల్త్ గేమ్స్, వరల్డ్ గేమ్స్ (2 సార్లు), ఐపిసి వరల్డ్ పారా వంటి అనేక అంతర్జాతీయ ఈవెంట్‌లలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన అంతర్జాతీయ పారా క్రీడాకారుడు. స్విమ్మింగ్, అథ్లెటిక్ -ఆర్చరీ ఈవెంట్‌లలో అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్.అంతర్జాతీయ ఈవెంట్లలో 11 బంగారు, 5 రజత, 4 కాంస్య పతకాలు,జాతీయ ఈవెంట్లలో 28 బంగారు పతకాలు,7 రజత,4 కాంస్య పతకాలను గెలుచుకున్నారు.ఈ సందర్భంగా డిఆర్ఎం శివేంద్ర మోహన్ జాతీయ అవార్డును గెలుచుకుని డివిజన్ గర్వించేలా చేసినందుకు సుబ్బయ్య తిరుమల కుమార్‌ను అభినందించారు. ఎడిఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), ఎం.శ్రీకాంత్ (ఆపరేషన్స్),సీనియర్ డిసిఎం వి. రాంబాబు, సీనియర్ డిఎస్‌సి&డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ వల్లేశ్వర బి తోకల ఉన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

విశాలాంధ్ర పెదపారుపూడి : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో టి. సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని హౌసింగ్ డే సందర్భంగా దూలవానిగూడెం, మహేశ్వరపురం, గ్రామాలలో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలకు మౌలిక అవసరతలతో పాటు అత్యవసరమైనవి గుర్తించిన వాటిని వెంటనే సిద్ధం చేయటానికి ఆయా శాఖల అధికారులు శనివారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మల్లికార్జున రావు, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ షహనాజ్, వెలుగు ఏపీఎం వసంతరావు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో స్ఫూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రాగం ధర్మరాజుకు సన్మానం

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : బందరు నియోజకవర్గ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో మచిలీపట్నం ఖొజ్జిలిపేటలో ఉన్న శ్రీ నాగేంద్రస్వామి వారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి చైర్మన్ రాగం ధర్మరాజును శనివారం సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు పల్లపాటి వెంకట్రావు (చిన్నబాబు) నూతనంగా ఎన్ని కైన రాగం ధర్మరాజు పూల కిరీటాన్ని అలంకరించి శాలువా తోను, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మకర్తల మండలి ద్వారా ఈ గుడిలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరగాలని భక్తులకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో గొరిపర్తి రాము, నాగన బోయిన రవి,ఆరేపు లక్ష్మణ కుమార్,యంపరాల సత్యనారాయణ, దేవన బోయిన వెంకటకృష్ణారావు,బోయిన అంతర్వేది, సంద్రం సూర్య ప్రకాష్, తోట నాంచారయ్య, డొక్కు నాగలక్ష్మి,పులిచెర్ల సత్యనారాయణ (చిట్టి), బోయిన పండు, బోయిన గంగరాజు, బోయిన రమేష్,గంగుల నాంచారయ్య, పెద్ది బోయిన శ్రీను, ఆళ్ల దుర్గమల్లేశ్వరరావుతదితరులు పాల్గొన్నారు.

తెలుగురావుపాలెం సచివాలయం సందర్శించిన డిప్యూటీ కలెక్టర్ చంద్ర లీల

విశాలాంధ్ర-ఘంటసాల: మండలం పరిధిలోని శ్రీకాకుళం, తెలుగురావుపాలెం గ్రామ సచివాలయాలను డిప్యూటీ కలెక్టర్ చంద్ర లీల శనివారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ తెలుగురావుపాలెం పంచాయతీల పరిధిలో జరుగుతున్న వాటర్ పైపులైన్ పనులు, వివిధ అభివృద్ధి పనులు గురించి సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబుని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన అభివృద్ధి పనులు ఎస్టిమేషన్ ఇంకా జరగవలసిన పనులు ఎస్టిమేషన్ తయారుచేసి సమర్పించవలసిందిగా సర్పంచ్ని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాస్ గ్రామ సచివాలయ సిబ్బంది అశ్విని కుమార్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ రాజకీయాలు తప్పుకాదు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : బిజెపిలో రాజకీయ నాయకుల వారసులు సరైన వారు లేకపోవడంతో ఇతర పార్టీలపై వారసత్వ రాజకీయాలు చేస్తున్నారంటూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని రాజకీయ విశ్లేషకులు తాతా సుబ్రమణ్యం తెలిపారు. శనివారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన దగ్గర నుండి రాజకీయ నాయకుల వారసులను రాజకీయాలకు తీసురావటం సర్వసాధా రణమని అయితే రాజకీయలోకి ప్రవేశించాక ప్రజల మన్నలను, అభిమానం పొందిన వారే కొనసాగు కలుగుతున్నార న్నారు. అటువంటి వారిలో నెహ్రూ కుమార్తె ఇందిరాగాంధీ అమె కుమారుడు రాజీవ్ గాంధీ ఆయన కుమారుడు రాహుల్ గాంధీ, రాష్ట్రంలో రాజశేఖర్‌రెడ్డి తనయుడు సీఎం జగన్మోహన్‌రెడి, చంద్రబాబు తనయుడు లోకేష్,తెలంగాణలో కేసీఆర్ తనయుడు కేటీఆర్ ఇలా చెప్పుకుంటే పోతే ఎంతోమంది ఉన్నారని అన్నారు బిజెపి నాయకులకు వారసుల్లో సరైన రాజకీయ వారసులు లేకపోవడంతో దాని నుండి ప్రజలను మభ్యపెట్టడానికి ఇతర పార్టీల వారు వారసత్వ రాజకీయాలు చేస్తున్నారంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో సంచలనాలు నమోదు అవ్వబోతున్నాయని,రాష్ట్రంలో గాని కేంద్రంలో గాని ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటాయి,తాను ఒక రాజకీయ విశ్లేషకులుగా చేసిన సర్వేలో తేటతెల్లమయ్యాయని పేర్కొన్నారు.

సమీకృత సాగువిధానంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: సమీకృత సాగునీటి విధానాలపై విస్సన్నపేటలో శనివారం అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాగునీటి యాజమాన్య విధానాలు, డ్రిప్, తుంపర సేద్య పరికరాలు, వాటికి లభించే రాయితీలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ, ఉద్యాన, చిన్ననీటి పారుదలశాఖలకు చెందిన అధికారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఈ సదస్సు నిర్వహించగా, భూగర్భ జలవనరులశాఖ అధికారి నాగరాజు రైతులకు పలు సూచనలందించారు.

విలేకరులు కావలెను

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ క్రింది ప్రాంతాల్లో విలేకరులుగా పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. కనీస విద్యార్హత ఇంటర్. స్థానిక పరిస్థితులపై కనీసం అవగాహన కలిగి ఉండాలి.. తెలుగుభాషలో ప్రావీణ్యం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, ఉంగుటూరు, నందివాడ, పెడన, కోడూరు, పామర్రు, తోట్లవల్లూరు, విజయవాడ నగరంలో విజయవాడ రూరల్, భవానీపురం, కొత్త ప్రభుత్వాసుపత్రి, ఆటోనగర్, గవర్నర్‌పేట, సింగ్‌నగర్.

సంప్రదించండి..

విశాలాంధ్ర దినపత్రిక
విశాలాంధ్ర ప్రధాన కార్యాలయం
చంద్రంబిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ - 520004
ఫోన్ : 8886782790 e-mail : visalvja@gmail.com

ఐక్యపోరాటంతోనే సమస్యల పరిష్కారం

ఉద్యోగుల ప్రయోజనాలే ఎన్‌జీఓ సంఘం ప్రధాన అజెండా : జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా ఏపి ఎన్‌జీవో అసోసియేషన్ పనిచేస్తుందని ఉద్యోగ సమస్యలపై చేపట్టే పోరాటాలలో విజయవాడ నగర శాఖ కీలక పాత్ర వహిస్తుందని ఏపిఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఏ. విద్యాసాగర్ అన్నారు. ఏపిఎన్‌జీవో నగరశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం విజయవాడ గాంధీనగర్‌లోని ఏపిఎన్‌జీవో హోమ్‌లో నిర్వహించారు. నగర కార్యవర్గానికి ఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు ఏ విద్యాసాగర్ బలపరచిన అభ్యర్థులు ఎన్‌జీవో హోమ్ నుండి అలంకార్ సెంటర్ మీదుగా ర్యాలీగా బయలు దేరి తిరిగి ఎన్‌జీవో హోమ్‌కు చేరుకుని ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కార్యవర్గంలోని ఒక్కొక్క పదవికి ఒక్కొక్కరు నామినేషన్ వేయడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు గెలిపొందినట్లు ఎన్నికల అధికారి ఎండీ ఇక్బాల్ ప్రకటించారు.

నగర శాఖకు ఎన్నికైన కార్యవర్గ సభ్యులు: ఏపిఎన్‌జీవో అసోసియేషన్ విజయవాడ నగరశాఖకు అధ్యక్షులుగా సిహెచ్.శ్రీరామ్ (స్త్రీ శిశు సంక్షేమ) సహాధ్యక్షులుగా బి.వి. రమణ(వైద్య ఆరోగ్య), కార్యదర్శిగా కె.సంపత్‌కుమార్ (పంచాయతీరాజ్), కార్యనిర్వహక కార్యదర్శిగా వి.వి. ప్రసాద్ (సమాచార), కోశాధికారిగా ఎస్‌కె. నాజీరుద్దీన్ (జలవనరుల), ఉపాధ్యక్షులుగా సిహెచ్. మధుసుదన్‌రావు (పాలిటెక్నిక్), బి. రాజాచౌదరి (వైద్య ఆరోగ్య) , ఎస్‌కె. కాశీమ్ సాహెబ్ (పశుసంవర్ధక), సిహెచ్. సి.వి.ఆర్. ప్రసాద్ (మల్యేరియా), సంయుక్త కార్యదర్శులుగా కె.ఆర్.ఎస్ గణేష్ (వాణిజ్య పనుల), సిహెచ్. ఎస్. రాధకృష్ణ (ఐటిఐ), పి శ్రీనివాస్‌రావు (పిఏవో), జి.వరప్రసాద్ (రెవెన్యూ), మహిళా సంయుక్త కార్యదర్శిగా బి. విజయశ్రీ (వైద్య ఆరోగ్య), డిఇసి మెంబర్లుగా కె. శివశంకర్ (ఆర్అండ్‌బి), ఏ. నాగరాజు (జైల్లు), యం రాంబాబు (ఏపిజిఎల్ఐ)లు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారని, నూతన కార్యవర్గం పదవీకాలం మూడు సంవత్సరాలపాటు కొనసాగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు. ఏపిఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యండి ఇక్బాల్ ఎన్నికల అధికారిగా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. సతీష్‌కుమాం సహాయ ఎన్నికల అధికారిగా, ఎన్నికల పర్యవేక్షకులుగా సిహెచ్.దిలీప్ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎన్‌జీవో అసోసియేషన్ మాజీ నేతలు జి. నారయణరావు, రాజారావు, టి.సత్యనారాయణ, కోనేరు రవి, డి సత్యనారాయణ రెడ్డి,యం నాగార్జున, బి ఆనంద్, వి సూర్యాబాబు, వివిధ శాఖల ఉద్యోగ సంఘ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని వివిధ తాలుకా యూనిట్ల కార్యవర్గ సభ్యులు ఉద్యోగులు పాల్గొన్ని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల : దివ్యాంగులుకు ప్రభుత్వం ఇస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కాసాని వేద సుప్రజ అన్నారు. శనివారం జిల్లా సమగ్ర శిక్షా ప్రాజెక్టు అధికారి ఎం.శేఖర్ ఆదేశాల మేరకు కపిలేశ్వరపురంలో నాన్ భవిత కేంద్రంలో "అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం" నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కె.అంకకుమారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలో దివ్యాంగులకు ప్రత్యేక అవసరాల ఏర్పాటు చేస్తున్నారని ఉపయోగించుకోవాలని కోరారు. సర్పంచ్ నాగమణి, హెచ్ఎం టి. ప్రభాకర్‌రావు కే మాధవి సిఆర్పిలు పి.రవి తేజ బాబు రావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ డీసీపీగా కే.శ్రీనివాసరావు బాధ్యతలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): ట్రాఫిక్ డీసీపీ కే.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతిరాణాను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. శ్రీకాకుళం జిల్లా అడ్మిన్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ఎస్పీ(నాన్‌క్యాడర్)గా పదోన్నతిపై పోలీస్ కమీషనరేట్ ట్రాఫిక్ డీసీపీగా నియమితులయ్యారు. వ్యాస్ కాంప్లెక్స్‌లోని ట్రాఫిక్ డీసీపీ కార్యాలయం ట్రాఫిక్ డీసీపీగా బాధ్యతలను స్వీకరించారు.

రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): రాష్ట్రపతి పర్యటన సందర్భంగా భారీ, గూడ్స్ వాహనాలను ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతిరాణా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నం నుండి హైదరాబాద్‌ల మధ్య భారీ, మధ్య తరహా రవాణా వాహనాల రాకపోకల మళ్లింపులు ఉదయం 8గంట నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ట్రాఫిక్ మళ్లించారు. హనుమాన్ జంక్షన్, నూజివీడు, మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మీదుగా ట్రాఫిక్ మళ్లింపు. హైదరాబాద్ నుండి విశాఖపట్నం వెళ్లే వాహనాలు నగరంలోనికి అనుమతించకుండా ఇబ్రహీంపట్నం-జి.కొండూరు-మైలవరం, నూజివీడు, హనుమాన్‌జంక్షన్ మీదుగా మళ్లించారు. విశాఖపట్నం నుండి చెన్నై వైపు వెళ్ళే వాహనములు హనుమాన్ జంక్షన్, రేపల్లె, చీరాల, త్రోవగుంట మీదుగా పంపడం జరుగుతుంది. గుంటూరు నుండి విశాఖపట్నం వైపు వెళ్ళే వాహనములు విజయవాడ వైపు అనుమతించకుండా వాటిని బుడంపాడు వద్ద నుండి పొన్నూరు, రేపల్లె, హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం పంపడం జరుగుతుంది.

టిడ్కో ఇళ్లల్లో మౌలిక వసతులు కల్పించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-తిరువూరు: పేదవాడి సొంతింటి కల నెరవేర్చడానికి గత ప్రభుత్వం హయాంలో నిర్మిం చిన టిడ్కో గృహాలు, ప్రస్తుత ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ప్రారంభించిన జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, వెంటనే నిరుపేద లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం తిరువూరు విచ్చేసిన ఆయన తిరువూరు పట్టణ శివారు పీటీ కొత్తూరులో నిర్మిస్తున్న టిడ్కో భవన సముదాయాలు, జగనన్న కాలనీలను కోటేశ్వరరావు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. మూడున్నరేళ్ళ క్రితం నిర్మించిన టిడ్కో భవన సముదాయాలు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరాయని ఆరోపించారు. కనీస నిర్వహణ లేక పక్కా భవనాలు గబ్బిలాలకు ఆవాసంగా మారాయన్నారు. పైన స్లాబులు పెచ్చులు ఊడి, ప్రమాదకరంగా ఉన్నాయని, తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో నివాస యోగ్యంగా లేవని ఆవేదన వ్యక్తంచేశారు. కాలనీ ప్రాంతమంతా ముళ్ళపొదలు, పిచ్చి చెట్లతో నిండిపోయి విషసర్పాలు సంచరిస్తున్నాయని విమర్శించారు. పక్కాగృహాల నిర్మాణంలో గృహ రుణాలు మంజూరు చేసిన బ్యాంక్‌లు రుణాలు తిరిగి చెల్లించమని లబ్దిదారులను వత్తిడి చేస్తున్నాయని, అటు ఇళ్ళనిర్మాణం పూర్తికాక, ఇటు బ్యాంక్‌ల వత్తిడి భరించలేక లబ్దిదారులు ఏం చేయాలో అర్థంకాక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి, నిరుపేదల అసహాయతను గుర్తించి వెంటనే యుద్ధప్రాతిపదికన ప్రత్యేక నిధులు కేటాయించి, టిడ్కో గృహాలు, జగనన్న కాలనీల్లో కనీస వసతులు కల్పించి వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 5న సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు టిడ్కో గృహసముదాయాల వద్ద ఆందోళనలు చేపడతామని కోటేశ్వరరావు హెచ్చరించారు. మహిళా సమాఖ్య నాయకురాలు దుర్గా కోటేశ్వరి, తూము కృష్ణయ్య, ఎస్ కే నాగుల్ మీరా, కొత్తపల్లి సుందరరావు, ఎస్ కే సుబాని, ఐ ముత్తయ్య, బీ అశోక్, వనమాలి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

మండలంలో నూతన శాఖలు ఏర్పాటు, పార్టీ బలోపేతమే ధ్యేయం

విశాలాంధ్ర-గంపలగూడెం : మండలంలోని తోటమూలలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి అందరం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సి.హెచ్.కోటేశ్వరరావు అన్నారు. తోటమూలలో పార్టీ కార్యాలయం వద్ద ఆయన శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన తోట మూల కార్యదర్శి షేక్. కరీముల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఏ మూలకు సరిపోవని, కనీసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆయన తెలిపారు. మండలంలో పార్టీ నూతన శాఖలు ఏర్పాటు చేసి సభ్యత్వాలు నమోదు చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీలలో కనీస సౌకర్యాలు లేవని రహదారులు, విద్యుత్ అందుబాటులో లేదని ఆయన విమర్శించారు. సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ వైసీపీ నాయకులు జగనన్న కాలనీలు గ్రామాలుగా ఏర్పడుతున్నాయని ఊదర కొడుతున్నారే తప్పా, నిర్మాణాలు లేవని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉన్నం సాంబశివరావు, తిరువూరు మండల కార్యదర్శి నృసింహాద్రి, వనమాలి, గంపలగూడెం పట్టణ కార్యదర్శి గౌర్రాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు
చట్టాలపై అవగాహనుండాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : విభిన్న ప్రతిభవంతులకు ప్రభుత్వం కల్పించిన చట్టాలు, హక్కులపై అవగాహన కలిగివుండాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. జిల్లా వయోవృద్దులు, హిజ్రాలు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, హక్కులకు భారత ప్రభుత్వ వికలాంగుల హక్కుల చట్టం 2016 రూపొందించిందన్నారు. ఈ చట్టంపై విభిన్న ప్రతిభావంతులు అవగాహన కల్గివుండి వాటిని సాధించుకోవాలన్నారు. సంస్థలు, ఆసుపత్రులు, పాఠశాలల్లో విభిన్న ప్రతి భావంతులపై వివక్షత, నిర్లక్ష్యం వహిస్తే సెక్షన్ 92 ప్రకారం కేసులను నమోదు చేయవచ్చని తెలిపారు. విభిన్న ప్రతిభాంతులను అదరించే సంస్థలను గౌరవించాలన్నారు. విద్య, ఉపాధి, ఉపకరణాల పంపిణీలో ముందంజలో ఉన్నప్పటికి వారిపట్ల ఇంకా మెరుగైన వాతావరణం కల్పించాల్సి ఉందన్నారు. సర్టిఫికేట్ ఆఫ్ డిజబుల్టీ ధృవ పత్రాలను 30 రోజుల్లో అందించాల్సి ఉందని, వారి సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో ప్రతిభతో రాణించాలన్నారు. ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు పెన్షన్లు, ట్రై సైక్రిళ్ళు, ల్యాప్‌టాప్‌లు వంటి ఉపకరణాలను అందజేయడంతో పాటు అర్హులైన వారికి బ్యాంకు రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.రవిప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు విద్య, వైద్యం, ఉపాధిలో రాణించే విధంగా పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల మంది విభిన్న ప్రతిభావంతులకు గృహాలను మంజూరు చేయడంతో పాటు 6 వేల మంది విద్యార్థులకు రూ.12 కోట్లు ఉపకార వేతనాలు అందించినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభవంతుల సంక్షేమ శాఖ ఎండీ ఎం.ఏ.కమార్‌రాజా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1750 మూడు చక్రాల వాహనాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులైన కళాశాల విద్యార్థులకు 8 ల్యాప్‌టాప్‌లు అందజేశారు. తొలుత విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహం, మెడోన్నా మూగ బదిరల కళాశాల, మానసిక వికాస కేంద్రం, కేడీపీ ట్రస్ట్, ప్రేమ వికాస్, ప్రేమ్ నికేతన్, విజయ మేరీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫర్ బ్లైండ్‌లకు చెందిన విభిన్న ప్రతిభవంతుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బ్లైండ్ విభాగ అసోసియేషన్ అధ్యక్షులు స్వామి, రాష్ట్ర ప్రతినిధి కిరణ్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్దుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.రామ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-కంచికచర్ల : దివ్యాంగులలో ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహిస్తే ఎంతో ఉన్నత స్థితికి చేరుకుంటారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. కంచికచర్లలోని భవిత కేంద్రంలో జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విభిన్న ప్రతిభావంతులకు శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శనివారం ప్రభుత్వం మంజూరు చేసిన ట్రై సైకిళు, వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం వివిధ రకాల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి -అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె డి సి సి బి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ మలక్ బషీర్, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, సర్పంచ్ వేల్పుల సునీత, జడ్పీటీసి వేల్పుల ప్రశాంతి, కే డి సి సి బి డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, ఎంఈఓ ఎల్ చిట్టిబాబు భవిత కేంద్రం అధికారులు పాల్గొన్నారు.

గర్భనిరోధానికి వ్యాసెక్టమి సులువైన పద్ధతి

విశాలాంధ్ర-వీరులపాడు: కుటుంబ నియంత్రణలో భాగంగా మగవారికి వ్యాసెక్టమి శాస్త్ర చికిత్స సులువైన మార్గమని వీరులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ దీపిక అన్నారు. వీరులపాడు పీహెచ్‌సీలో గర్భనిరోధక వ్యాసెక్టమి శాస్త్ర చికిత్సపై స్థానికులతో శనివారం అవగాహన సదస్సును వీరులపాడులో నిర్వహించారు. ఎటువంటి కోత, కుట్లు, ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేనటువంటి శాస్త్ర చికిత్స విధానం మగవారికి ఉందని, ఈ ఆపరేషన్ పై ఎటువంటి అపోహలు వద్దని, ఈ ప్రక్రియలో ముందుకు వచ్చి శాస్త్ర చికిత్స చేయించుకున్న పురుషులకు 1250 రూపాయల పారితోషకాన్ని ప్రభుత్వం అందజేస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ దీపిక, డాక్టర్ నందిని, సిహెచ్ఓ, ఎం పి హెచ్ ఈ ఓ, ఏఎన్ఎం పాల్గొన్నారు.

ఇళ్లు పీకితే రిటైనింగ్ వాల్ ఎందుకు..? : గద్దె

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : కృష్ణానది పరివాహక ప్రాంతంలోని ఇళ్లు వరదకు నీట మునగకుండా రిటైనింగ్ వాల్ నిర్మించాల్సి ఉంటే వైసీపీ ప్రభుత్వం ఇళ్లు పీకి రిటైనింగ్ వాల్ నిర్మాణమేంటని స్థానిక ఎమ్మెల్యే గద్దె రామమోహన్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కృష్ణలంక 21వ డివిజన్ ఆర్చిరోడ్డులో కరకట్ట ప్రాంతంలో ఎమ్మెల్యే శనివారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నాలుగైదు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఈ ప్రాంత ప్రజలను తరలించకుండా వరదల ముంపు నివారణకు రిటైనింగ్ వాల్ నిర్మాణమే సరైందని అన్ని పార్టీలు గుర్తించినట్లు తెలిపారు. మొదటి దశలో టీడీపీ ప్రభుత్వం రెండున్నర కిలోమీటర్లు రిటైనింగ్‌వాల్ నిర్మించి ఒక్క ఇంటిని కూడా తొలిగించలేదన్నారు. స్థానిక డివిజన్ టీడీపీ అధ్యక్షులు వి.దుర్గారావు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, నాయకులు గొర్రిపర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటోలో చెలరేగిన మంటలు

విశాలాంధ్ర-విజయవాడ(క్రైమ్): విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ డాబా కోట్ల సెంటర్‌లో శనివారం ఆటోలో మంటలు చెలరేగాయి. డాబా కోట్ల సెంటర్ నుండి వెళ్తున్న ఆటో నుండి ఒక్కసారిగా మంటలు రావడంతో ఆటోడ్రైవర్ తప్పించుకుని బయటకు వచ్చేశాడు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఎవరికి ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

తమిళనాడు స్టేట్ డెఫ్ క్రికెట్ టీమ్‌లో అమెజాన్ ఉద్యోగులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శారీరక వైకల్యాన్ని సాకుగా చూపకుండా, ఉన్నత సంకల్పం ఉన్న వ్యక్తులు తమ లక్ష్యాన్ని సాధించేందుకు, తమకు తాము మెరుగైన జీవితాన్ని సృష్టించుకునేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటారు. కోయంబత్తూరులోని అమెజాన్ ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రంలో వినియోగదారుల ఆర్డర్‌లను ప్యాక్ చేసే తమిళనాడుకు చెందిన కుమార్.ఎస్, మహారాజా.బి అనే ఇద్దరు వినికిడి లోపం ఉన్న యువకులు దీనికి గొప్ప ఉదాహరణ. వారిద్దరూ ఇప్పుడు తమిళనాడు స్టేట్ డెఫ్ క్రికెట్ టీమ్‌లో ఆడుతున్నారు. క్రికెట్ ఫీల్డ్‌తో పాటు తమ వర్క్ ప్లేస్‌లోనూ వారు ఏస్‌ను కొనసాగిస్తున్నారు.

ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్న ప్రైవేట్ ట్రావెల్స్‌ను అరికట్టండి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్) : ఆర్టీసి ఆదాయాన్ని గండికొడుతున్న ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆరికట్టాలని ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎస్.చక్రవర్తి, కార్యదర్శి వై.శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.రామకృష్ణలు అడ్మిన్ డీసీపీ సత్తిబాబుకు వినతి పత్రం అందజేశారు. ఏపిపిటిడి(ఆర్టిసి) ప్రభుత్వ రవణావ్యవస్థగా మారినందున ప్రతిరోజు ఆర్టిసికీ కోట్లరూపాయలలో నష్టం కలుగుతోందన్నారు. ప్రైవేటు ట్రావెల్స్ అన్ని విజయవాడ కేంద్రంగానే రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా తిప్పడమే కాకుండా రాజదాని నగరంలో ఉన్న విజయవాడ పి.యన్.బి.యస్ బస్సుస్టాండుకు ఆనుకొని ఈట్రావెల్స్ అన్ని తిప్పుతూ ఆర్టీసీ ఆదాయానికి గండి కొట్టి ప్రభుత్వానికి నష్ట పరుస్తున్నారన్నారు. ఈఅక్రమరావాణాని కట్టడిచేసి ప్రజా రవాణా ఆర్టిసిని ఆదుకోవాలని కోరారు. ఈట్రావెల్స్ పట్టణ ప్రాంతంలోగా ఈబస్సులు ఆపు ట్రాఫిక్ కు ఇబ్బందులు కూడా కలిగిస్తున్నారని తెలియజేశారు.

రౌడీషీటర్ అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): రౌడీషీటర్ అనుమానాస్పద మృతి చెందిన ఘటన శనివారం గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఊర్మిళానగర్‌కు చెందిన పూలకృష్ణకుమార్(40) భవానీపురం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. నిత్యం మద్యానికి బానిసైయ్యాడు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడు. మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైలు పట్టాల పై గుర్తుతెలియని మహిళ మృతి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): విజయవాడ శ్రీనగర్ కాలనీ మచిలీపట్నం లైన్ రైల్వే పట్టాల పై గుర్తుతెలియని మహిళా మృతి చెందింది. ఈ ఘటన శనివారం సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 45 సంవత్సరాలు కలిగిన మహిళా రైలు పట్టాల పై మృతి చెందివుంది. నలుపు చీర ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు.ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుండి జారీ మహిళ మృతి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైలు నుండి జారీ గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు రైల్వే సిఐ కె.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం సుమారు 35 నుండి 40 సం.లు వయస్సు గల గుర్తు తెలియని మహిళ మచిలీపట్నం డౌన్‌లైన్‌లో ఉన్న బుడమేరు రైల్వేట్రాక్ వద్ద రైలు నుండి జారీ తీవ్రగాయలతో మృతి చెందినట్లు సమాచారం వచ్చిందన్నారు. మృతురాలు ఎరుపు రంగుతో గుండ్రని ముఖం కలిగి ఉంది. శరీరంపై నలుపు రంగు చీర, ఎరుపు రంగు జాకెట్ ధరించి ఉంది.అంతకుమించి వివరాలు లభించలేదన్నారు. వివరాలు తెలిసినట్లయితే రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు

నేడు కంచికచర్లలో కేడీసీసీ బ్యాంక్ భవనం ప్రారంభం

విశాలాంధ్ర-కంచికచర్ల : మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో గల కేడిసిసి బ్యాంకుపై కొత్తగా నిర్మించిన అదనపు నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్" ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్రావు, బ్యాంక్ చైర్మన్ నాగేశ్వరరావు తన్నీరు, డైరెక్టర్ కొమ్మినేని రవి శంకర్, డీసీఎంఎస్ డైరెక్టర్ బండి జానకిరామయ్య ఎంపీపీ మాలక్ బషీర్, సర్పంచ్ వేల్పుల సునీత ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనరు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి : ఎమ్మెల్యే మల్లాది

విశాలాంధ్ర-విజయవాడ (స్పోర్ట్స్): క్రీడా స్ఫూర్తిని పెంపొందిచుకోవాలని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 1వతేదీ నుండి 3వతేదీ వరకు బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలో జరిగిన జగనన్న క్రీడా సంబరాలు ఘనంగా ముగిశాయి. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ అజీజ్ అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మల్లాది విష్ణు హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ రెండు క్రీడా జట్లను ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో సెంట్రల్ జట్లను జోనల్ స్థాయికి రాష్ట్ర స్థాయిలో పోటీల్లో రాణించాలన్నారు. జోనల్ స్థాయిలో పాల్గొనే సెంట్రల్ జట్లకు క్రీడా దస్తులు బహుకరిస్తారన్నారు. అనంతరం గెలుపొందిన జట్లకు ట్రోఫీలను అందజేశారు.

వైకల్యాన్ని శాపంగా పరిగణించకూడదు : డీఆర్ఎం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైల్వే బోర్డు ఇచ్చిన అదేశాలు మేరకు 4 శాతం రిజర్వేషన్ ఇన్ ప్రమోషన్ ఫర్ మెంచ్ మార్కు అమలు చేస్తున్న డివిజన్ విజయవాడ మాత్రమే అని డిఆర్ఎం శివేంద్రమోహన్ తెలిపారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం'(పిడబ్ల్యుడి) సందర్భంగా శనివారం డివిజనల్ రైల్వే ఆడిటోరియంలో 'ప్రత్యేక వికలాంగ ఉద్యోగులకు పదోన్నతి కోసం బెంచ్‌మార్క్ రిజర్వేషన్' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఎం మాట్లాడుతూ వైకల్యాన్ని శాపంగా పరిగణించకూడదన్నారు. ప్రభుత్వం నిరంతర వారికి అండగా ఉంటుందన్నారు. ఏడీఆర్ఎం డి.శ్రీనివాసరావు (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) మాట్లాడుతూ వికలాంగులకు రైల్వే పరంగా అందిస్తున్న వివిధ సౌకర్యాల గురించి సవివరంగా వివరించారు.దివ్యాంగుల ప్రయాణీకులకు ప్రయాణ సౌలభ్యం కోసం భారతీయ రైల్వేలు వికలాంగులకు ర్యాంప్‌లు, యాంటీ స్కిడ్ టైల్స్, కేటాయించిన పార్కింగ్, ప్రత్యేక టిక్కెట్ వంటివి ఉన్నాయన్నారు. కౌంటర్లు, నీటి తొట్టెలు, మరుగుదొడ్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు మొదలైన వాటికి భారతీయ రైల్వే భరోసా ఇస్తోందన్నారు. అనంతరం వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన 13 మంది సిబ్బందిని డిఆర్ఎం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఆర్ఎం కె.శ్రీకాంత్ (ఆపరేషన్స్),సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి ఎమ్.బి.మురళీధర్, డిపిఓ షేక్ షాహబాజ్ హనూర్, ఎపిఓలు కె.శ్రీనివా సరావు, మాణిక్యరావు, డిఎమ్ఆర్‌కె డివిజనల్ అధ్యక్షులు ఎ.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

మార్చిలో షిరిడి సాయికి కోటి రుద్రాక్ష అభిషేకం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ఆంధ్ర శిరిడిగా పిలవబడుతున్న ముత్యాలంపాడు శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో శివ కేశవ స్వరూపంగా కొలువైయున్న సమర్థ సద్గురువు షిరిడి సాయినాథునికి శోభకృత్ నామ సంవత్సరారంభ పర్వదినాలలో మార్చి 28వ తేదీ మంగళవారం కోటి రుద్రాక్ష అభిషేకం నిర్వహిస్తున్నట్లు మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పి గౌతమ్ రెడ్డి తెలిపారు. ఉదయం మూడు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు నిర్విరామంగా రుద్రాక్షాభిషేక కార్యక్రమం కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు. ఈ బృహత్తర యజ్ఞానికి నేపాల్ ప్రాంతంలోని కాట్మండు తదితర ప్రాంతాల నుంచి కోటి రుద్రాక్షలు సేకరిస్తున్నట్లు తెలిపారు. సేకరించిన కోటి రుద్రాక్షలను శుభ్రపరచి రంధ్రం వేసి రాగి తీగతో 108 రుద్రాక్షల చొప్పున దండగా తయారు చేసి వాటిని గోక్షీరంతో శుద్ధిచేసి సాయినాథునికి అభిషేకం చేస్తామని తెలిపారు. రుద్రాక్షాభిషేక కార్యక్రమానికి పీఠాధిపతులు, మఠాధిపతులు విచ్చేస్తున్నట్లు తెలిపారు. రుద్రాక్ష ధారణ వలన కర్మ దోష,పాప నివారణ కలిగి మానవాళికి ఆరోగ్యాన్ని మనశ్శాంతిని ప్రసాదిస్తాయని తెలిపారు. రుద్ర నమక చమక, దుర్గా, నారాయణ, ఆయుష్య, పవమాన, విష్ణు, సూక్ష్మ క్రిమి సంహారిక, నవగ్రహ, నక్షత్ర, భూ,సర్ప, మన్యు, సరస్వతీ, సూర్య సూక్తములతో భక్తులచే స్వయంగా అభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. 108 రుద్రాక్షలతో చుట్టిన దండలను భక్తులకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఇన్‌టుప్లే 5వ వార్షికోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఇన్‌టుప్లే స్కూల్ 5వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ప్రముఖ న్యాయవాది చలసాని అజయ్ కుమార్, డాక్టర్ శరత్ చంద్ర డాక్టర్ అనిత విచ్చేసి పిల్లలను ఉద్దేశించి ప్రసంగించారు. పిల్లలను క్రమశిక్షణతో పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని వారు సూచించారు. ఇన్‌టుప్లే స్కూల్ ఎండీ చేకూరి రాజా మాట్లాడుతూ 20 ఏళ్లపాటు అమెరికాలో ఉన్నామని అక్కడ ప్లే స్కూల్‌లో ఆటలు విద్యను ఎలా అందిస్తున్నారో, అదేవిధంగా ప్లే స్కూల్ విద్యార్థులకు అలాంటి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసభరితమైన వాతావరణం లో సాగింది. ఈ కార్యక్రమంలో ఇన్ టు ప్లే స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ నూతక్కి శ్రీలక్ష్మి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలీవుడ్ ర్యాపర్ కింగ్తో రైడర్ ఆంథమ్ 2.0 ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బైకింగ్ ఫెస్టివల్ కోసం ఇండియా బైక్ వీక్లో రైడర్ ఆంథమ్.. 2.0ని రూపొందించింది. ఈ ఇండియా బైక్ వీక్ ఫెస్టివల్ డిసెంబర్ 2 నుంచి 3 వరకు, గోవాలోని వెగటార్లో జరిగింది. రెండు రోజుల పాటు అత్యంత గొప్పగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా రైడర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. రైడర్ ఆంథమ్ 2.0 ఒక అద్భుతమైన సూపర్ హీట్ పాట. బాలీవుడ్ రాపర్ కింగ్ కంపోజ్ చేసి, స్వయంగా పాడిన ర్యాప్ సాంగ్, "పవర్ అప్ విత్ పెట్రోనాస్ స్ప్రింటా" అనే థీమ్ ఆధారంగా దీన్ని రూపొందించాడు. బాలీవుడ్ గాయకుడు అర్జున్ కనుంగో నటించిన రైడర్ ఆంథమ్ మొదటి ఎడిషన్ గత ఏడాది సంచలనం సృష్టించింది. ఇప్పుడు రెండోసారి రైడర్ ఆంథమ్ 2.0గా రూపొందించిన ఈ ర్యాప్ వెర్షన్.. ఖచ్చితంగా బైకింగ్ కమ్యూనిటీని మరో స్థాయికి తీసుకువెళ్తుందని ఆశిస్తున్నారు. పెట్రోనాస్ లూబ్రికెంట్స్ ఇండియా సీఈఓ శ్రీ ప్రణవ్ భానాగే మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఇండియా బైక్ వీక్తో భాగస్వామ్యం కావడం పట్ల మేము చాలా ఆనందంగా ఉందన్నారు. భారతదేశంలోని బైకింగ్ అభిరుచిని గోవాలో పూర్తి ప్రదర్శనలో చూడటం సంతోషంగా ఉందని తెలిపారు.

రహదారులు అందంగా తీర్చిదిద్దండి : కమిషనర్ దినకర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర రహదార్లు అందంగా తీర్చిదిద్దాలని నగర పాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిస్వాభూషణ్ హరిచందన్ ఆహ్వానం మేరకు ఈ నెల 4వ తేదిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ రాజ్‌భవన్ పర్యటన సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, రాష్ట్రపతి సందర్శించే రహదారులు రోడ్ల ఏర్పాట్లు పురోగతిని కమిషనర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా ఏర్పాటు చేసిన మొక్కలను పరిశీలించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బెంజిసర్కిల్ దగ్గర ప్రధాన, అంతర్గత రోడ్లులో పారిశుధ్య నిర్వహణ విధానం, సైడ్ డ్రైయిన్స్‌లో మురుగు నీటి పారుదల విధానం పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏ.డి.హెచ్ శ్రీనివాసు, అధికారులు శానిటరీ సెక్రటరి పాల్గొన్నారు.

ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం : కమిషనర్ రాఘవేంద్ర

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: పట్టణంలో ఆరు సచివాలయంలో ఇప్పటికే గడపగడపకి మన ప్రభుత్వం పూర్తయిందని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నిటికీ త్వరలోనే పరిష్కారం చూపిస్తామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, కౌన్సిలర్లుతో శనివారం ఆయన ఛాంబర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు పటాన్ ఫిరోజ్ ఖాన్, కాశీ కిషోర్, పూసల పుల్లారావు, తోట కృష్ణవేణి, గుంజా లక్ష్మణ్, తన్నీరు నాగేంద్ర, మోరె బాబి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

పట్టణంలోని సీతారామపురం పరిధిలో రెండు రోజుల క్రితం శంకుస్థాపన చేసి ప్రారంభించిన రోడ్డు పూర్తిగా వేయడం జరిగిందని 28 రోజులు క్యూరింగ్ తర్వాత శాసనసభ్యులు సామినేని ఉదయభాను చేతుల మీదుగా ఈ రోడ్డును ప్రారంభిస్తామని మునిసిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం పూర్తయిన సిమెంట్ రోడ్డును పరిశీలించారు. అన్ని వార్డులలో కూడా ప్రాధాన్యత ను బట్టి అన్ని పనులను పూర్తి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, వైఎస్ఆర్సిపి నాయకులు కాశీ కిషోర్, పూసల పుల్లారావు, మున్సిపల్ డి ఈ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర-ఏ కొండూరు : వెలుగు డిపార్ట్మెంట్లో యానిమేటర్స్‌గా విధులు నిర్వహిస్తున్న మహిళలపై రాజకీయ వేధింపులు ఎక్కువ అయ్యాయని, అందువల్ల ప్రభుత్వం యానిమేటర్స్‌పై జరిగే రాజకీయ వేధింపులను తగ్గించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని జిల్లా యానిమేటర్ల సంఘం గౌరవ అధ్యక్షురాలు ఏ కమల అన్నారు. శనివారం మండలంలోని చీమలపాడులో జిల్లా యానిమేటర్ల 3వ మహాసభ ఆళ్ల ఉమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో కమల మాట్లాడుతూ యానిమేటర్ల పదవీకాల పరిమితి 3 సంవత్సరాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 15 డ్వాక్రా గ్రూపులలో లోపు ఉన్న సంఘాలకు 2021 ఏప్రిల్ నుండి జీతాలు పెండింగ్లో ఉన్నాయని ఆ పెండింగ్లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. వీవోఏ ల సమస్యలపై ప్రభుత్వంపై నిరంతరం ఆందోళనలో పోరాటాలు కొనసాగిస్తున్నామని ఆందోళన కార్యక్రమాల్లో వివోఏలు అందరూ కలిసికట్టుగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈనెల 15 16 తేదీల్లో సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా మహాసభలో విజయవాడలో జరుగుతున్నాయని వివోఏలు అందరూ పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని ఆమె కోరారు మహాసభ అనంతరం యానిమేటర్ల నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు ఎన్టీఆర్ జిల్లా నుతన కమిటీ గౌరవఅధ్యక్షురాలుగా ఏ కమల ప్రధాన కార్యదర్శిగా ఆళ్ల ఉమాదేవి అధ్యక్షురాలిగా షేక్ చాంద్ బేగం ఉపాధ్యక్షురాలుగా ఎం విజయలక్ష్మి కమిటీ సభ్యులుగా కే ఉమా సహాయ కార్యదర్శిగా డి కళ్యాణి షేక్ మున్ని కోశాధికారిగా సిహెచ్ సురేష్ తో సహా 15 మందిని నూతన కమిటీగా ఎన్నుకున్నారు ఇంకా ఈ కార్యక్రమంలో ఏ కొండూరు మండల కార్యదర్శి సిఐటీయు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (Union Bank of India)
లోటస్ ల్యాండ్ మార్క్ బ్రాంచి, విజయవాడ - 520003.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకొని తిరిగి చెల్లించమని నోటీసులు పంపినను తిరిగి చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం ది. 20-12-2022, మంగళవారం సా॥ 4.00 గంటలకు బ్రాంచి ఆవరణలో బహిరంగవేలం వేయబడును. వేలం తేదీనా బకాయి రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదారు ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరిసారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

క్ర. సం.	ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు	స్థూల బరువు (గ్రాములలో)
1.	222030100028207	మారీదు కనకదుర్గా దేవి, డి.నెం. జి.ఎఫ్-1, ప్లాట్ నెం. 44, స్పెండర్ గార్డెన్స్, రోడ్ నెం. 6, లోటస్ ల్యాండ్ మార్క్, అయోధ్యనగర్, విజయవాడ-520003	79.0

షరతులు : 1) వేలంలో పాల్గొనువారు రూ. 5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే) ధరావత్తు చెల్లించవలెను. 2) వేలంలో ఆభరణములు పొందినవారు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెను. వేలంలో ఆభరణములు పొందని వారికి ధరావత్తు సొమ్ము వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. 3) ఏ స్థితిలోనైనా వేలం నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 4) వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 5) వేలంలో పాల్గొను వారు ఆధార్ మరియు పాన్‌కార్డుల కాపీలను సమకూర్చవలెను.

ది. 03-12-2022 సం/- అధీకృత అధికారి